వైద్యులు లేక రోగుల ఇక్కట్లు

- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్యుడి కొరత
- వ్యక్తిగత కారణాలతో రెండు నెలల క్రితం రాజీనామా చేసి వెళ్లిన డాక్టర్
- నేటివరకు నియమించని వైనం
- పూర్తిస్థాయి వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్న రోగులు



ఓల్డ్‌టౌన్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం

రేపల్లె రూరల్: పేదలకు అందజేసే వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండు నెలల నుంచి వైద్యుడు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నచందాన మారుతోంది ఓల్డ్‌టౌన్ అంకమ్మచెట్టు పక్కన ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (అర్బన్ హెల్త్‌సెంటర్) పరిస్థితి. వైద్యశాలలో అన్ని రకాల వసతులు, సిబ్బంది ఉన్నప్పటికీ వైద్యుడు లేకపోవటంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మిగులుతోంది. గత రెండు నెలల క్రితం వైద్యశాలలో విధులు నిర్వర్తించే వైద్యుడు వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోవటం, మరో వైద్యుడిని నియమించకపోవటంతో వైద్యశాలకు వచ్చేరోగులకు ఇక్కట్లు తప్పటంలేదు. ప్రస్తుతం ఉన్న వైద్యసిబ్బంది కొన్ని సేవలు మాత్రమే అందిస్తున్నారు.


వైద్యుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

హెల్త్‌సెంటర్‌లో అందే వైద్యసేవలివే..

అర్బన్ హెల్త్ సెంటరులో నిత్యం ఈ ప్రాంతంలో 40 నుంచి 50 మంది వరకు వైద్యసేవలు పొందుతుంటారు. జ్వరాలు, డయాబెటిస్, కుక్కకాటు, పాముకాటు వంటివాటితో పాటు ఇతర వ్యాధులకు చికిత్సలు అందుతుంటాయి. అదేవిధంగా రక్తపరీక్షలు, ఈసీజీ వంటి పరీక్షలు చేస్తుంటారు. వైద్యశాల సమీపంలో ఎవరైనా అపస్మారక స్థితిలో చేరుకున్న, ప్రమాదాలబారిన పడిన ఈ వైద్యశాలను ఆశ్రయించి చికిత్సలు పొందిన పరిస్థితులు అనేకం ఉన్నాయి.


వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

అయితే వైద్యుడు లేకపోవటంతో కొన్ని వ్యాధులకు మాత్రమే చికిత్సలు పరిమితమవుతున్నాయి. మిగిలిన వ్యాధులను చూపించుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు పట్టణంలోని ఇతర వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వీరే..

వైద్యశాలలో ప్రస్తుతం ఇద్దరు స్టాఫ్ నర్సులు విధులు నిర్వర్తిస్తుండగా ఒక ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మందులు అందించే ఉద్యోగి ఉన్నారు. ఇంత మంది పనిచేస్తున్నా వైద్యశాలలో ప్రధానంగా ఉండాల్సిన వైద్యుడు లేకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. ప్రభుత్వం వెంటనే వైద్యశాలలో వైద్యుడిని నియమించి ఇక్కట్లు తప్పించాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

■ అదేవిధంగా వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవటంతో వైద్యశాల సిబ్బంది తమ సొంత ఖర్చులతో సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వైద్యశాలలో పరిశుభ్రతను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ



వేమూరు: రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరరావు తెలిపారు. వేమూరు పోలీసు స్టేషనులో శనివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు అల్లరుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు మానుకోవాలని హితవు పలికారు. వేమూరు, చుండూరు రూరల్ సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

పెదలంక(భట్టిప్రోలు): ఇటీవల కృష్ణానదికి వరదలు సంభవించిన నేపథ్యంలో భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామంలోని స్వాతి హైస్కూల్ విద్యార్థులను ఆదుకునేందుకు మాతృశ్రీ ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థి సమితి(జిల్లెళ్లమూడి) ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. 100 మంది విద్యార్థులకు రూ. 1500 వ్యయం చేసే నోట్ పుస్తకాలను అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సమితి అధ్యక్షులు, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల కరస్పాండెంట్ గోగినేని రాఘవేంద్రరరావు, కార్యదర్శి కె.శేషాద్రి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరవపల్లి గ్రామసభకు 12 అర్జీలు



రేపల్లె రూరల్: రీసర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభలలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గతంలో జరిగిన సర్వేలో దొర్లిన తప్పులను ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో సరిచేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 12 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నగరం: రీసర్వేలోని భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.నాంచారయ్య చెప్పారు. మండలంలోని పమిడిమర్రులో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై శనివారం జరిగిన గ్రామసభలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యలను గ్రామ సభల ద్వారా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పమిడిమర్రులో ఆరు అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్‌కు అర్హత సాధించిన 21 మందికి 10(ఎ) గార్ల్స్ బెటాలియన్ యూనిట్ కో–కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, హవల్దార్ ఆసీఫ్ సయ్యద్‌లు ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను అందించారు. ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఆర్గనైజర్ కేవీఎల్ పార్వతి, కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 22 మంది విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరారు.

వేమూరు పీఎస్‌లో ఓపెన్‌హౌస్



వేమూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం వేమూరు పోలీసుస్టేషనులో వివిధ పాఠశాలల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించామని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి


ఎన్జీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న అక్రమ వాణిజ్య కట్టడం

బాపట్ల: ఎన్జీఓ కార్యాలయ ఆవరణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాణిజ్య కట్టడాన్ని నిలుపుదల చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు జోగి రాజా పేర్కొన్నారు. ఈమేరకు నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా కమిషనర్ కట్టడాన్ని నిలుపుదల చేయాలని నోటీసులు కూడా ఇచ్చారని జోగి రాజా తెలిపారు. అధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయకుండా నిర్మాణ పనులు జరగటంపై న్యాయపోరాటానికై నా సిద్ధంగా ఉన్నామని జోగి రాజా తెలిపారు. నిర్మాణానికి సహకరిస్తున్న సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

ఒంటరి వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

తెనాలిరూరల్: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి మెడలోని గొలుసు అపహరించుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణ నాజరుపేటకు చెందిన వెచ్చా సుజయలక్ష్మి ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేయగా ఒంటరిగా ఉంటోంది. ఇల్లు అద్దెకు కావాలంటూ శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ ఒకరు సుజయలక్ష్మి ఇంటికి వచ్చింది. మాటలు కలిపి అదును చూసి మెడలోని గొలుసు లాక్కు వెళ్లింది. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు శనివారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్


మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి

రేపల్లె రూరల్: పేద ప్రజపై విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.6072 కోట్ల భారాన్ని మోపేందుకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ భారాలపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేనలు కూటమిగా ఏర్పడి ప్రజలపై ఉమ్మడి బాదుడు ప్రారంభించాయన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదనలు చేసినా రూ.6,072 కోట్లు సర్దుబాటు చార్జీలు నవంబర్ నుంచి వసూలు చేయాలాని పూనుకోవటం దుర్మార్గమన్నారు. నాలుగు నెలల్లో సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలుచేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం భారాలను మోపటంలో మాత్రం ముందుందని చెప్పారు. ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించాలన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టటం నిలుపుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఎం నేతలు కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, కేవీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన కరపత్రాలు ఆవిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు

బాపట్ల: కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నవంబరు 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు కార్తిక వన సమారాధన కరపత్రాలను స్థానిక అన్నం సతీష్‌ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఇక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది వలే కాపు విద్యార్థులకు విద్యా పురస్కారాలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈనెల 27వతేదీ నుంచి నవంబరు 11 వరకు కాపు కళ్యాణమండపంలో దరఖాస్తులను తీసుకుని పూర్తి చేసి అందించాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు సాయం 4 గంటల నుంచి 7గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాపు సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

నేడు బాపట్లలో రెడ్ల ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అఖిలభారత రెడ్ల ఐక్య వేదిక కన్వీనర్ పట్నం సురేంద్రరెడ్డి

బాపట్ల: బాపట్లలో అఖిలభారత రెడ్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రెడ్ల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ పట్నం సురేంద్ర రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఉదయం 10గంటలకు ఆత్మీయ సమావేశం ప్రారంభమవుతుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెడ్డి సోదరులందరు హాజరవుతారని తెలిపారు. రెడ్డి వర్గీయులు అనే సమస్యలతో నేడు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్థికంగా, ఉపాధి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించటంతో పాటు సంక్షేమానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో రెడ్డి సోదరులు అందరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కో–కన్వీనర్ దొరకచెర్ల భరత్ రెడ్డి, సభ్యులు బండి దామోదర రెడ్డి, జానకి రామరెడ్డి, కంబాలచేను జితేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కొట్టేసి.. ఇంటివారికే అమ్మజూపి..


చోరీకి పాల్పడ్డ అమరే కుమార్

చెరుకుపల్లి: ఓ ఇంట్లో సెల్‌ఫోన్ చోరీ చేసి వారి కుటుంబ సభ్యులకే విక్రయించబోయి పట్టుబడిన దొంగ ఉదంతమిది. స్థానికుల వివరాల మేరకు అమృతలూరు మండలం పాంచలవరం గ్రామానికి చెందిన అమరే కుమార్ శుక్రవారం రాత్రి చెరుకుపల్లి భాస్కర్ థియేటర్ ఎదురు వీసం వెంకటేశ్వరరావు ఇంటిలో మంచంపై పెట్టిన సెల్‌ఫోన్‌ను కొట్టేశాడు. మరుసటిరోజు ఫోన్‌లో సిమ్ కార్డులు తీసివేసి దొంగతనం జరిగిన ఇంటికి కొంత దూరంలో వెంకటేశ్వరరావు కోడలు నిర్వహిస్తున్న టిఫిన్ బండి దగ్గరకు వెళ్లి ఫోన్‌ను ఆమెకు విక్రయించబోయాడు. ఫోన్ తమ మామదిగా గుర్తించిన ఆమె నిలదీయడంతో కుమార్ తన నేరాన్ని అంగీకరించాడు. అయితే సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తి గత నాలుగు రోజుల క్రితం గుళ్లపల్లిలోని ఓప్రవేటు హాస్పిటల్‌లో చోరీకి యత్నించగా సిబ్బంది దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారని సమాచారం.

బుర్రిపాలెంరోడ్డులో ఖాళీ కొబ్బరిబొండాల తరలింపు

ఎట్టకేలకు స్పందించిన పట్టణ మున్సిపాలిటీ


కొబ్బరి బొండాల తరలింపు

తెనాలి: మున్సిపల్ కంపోస్టు యార్డు కలిగిన పట్టణ బుర్రిపాలెంరోడ్డులో కొంతకాలంగా పట్టణంలో విక్రయిస్తున్న కొబ్బరి బోండాలను డంప్ చేస్తున్నారు. రోడ్డు పొడవునా వరుసగా వీటిని అన్‌లోడింగ్ చేస్తూ పోతున్నారు. రోడ్డు పక్కన విశాలమైన మార్జిను నిండిపోయి రోడ్డుపైకి కూడా ఖాళీ కొబ్బరి బొండాలు వచ్చేస్తున్నాయి. పలు విద్యాసంస్థలు, దాల్ మిల్లులు కలిగిన ఆ రోడ్డులో బుర్రిపాలెం, చక్రాయపాలెం, చదలవాడ, అనంతవరం, చిలుమూరు, ఈపూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు స్కూల్‌బస్సులు, వ్యాపార లారీలు నిత్యం తిరుగుతుంటాయి. వాహనాల రద్దీ కలిగిన ఆ రోడ్డులో పట్టణం వెలుపల నుండి కిలోమీటర్ల పొడవునా ఖాళీ కొబ్బరి బోండాలతో రోడ్డు కుంచించుకోపోయింది. దీనిపై కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తులు కేంద్ర సహాయమంత్రి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాలు...ఏమైనా గానీ మొత్తంమీద మున్సిపాలిటీ స్పందించింది. శనివారం రెండు డంపర్లు, మూడు పొక్లయిన్లతో కొబ్బరి బోండాలను తొలగించటం ఆరంభించారు. సాయంత్రం వరకు కొనసాగుతోంది. బయట ప్రాంతానికి వీటిని తరలిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయండి

భట్టిప్రోలు: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన మహా విజ్ఞాపన దీక్షను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రేపల్లె ఏరియా కన్వీనర్ జి.బాలాజీ శనివారం కోరారు. బాలాజీ మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ దీక్షలో బాధితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌పీసీ వైస్ చైర్మన్‌కు అభినందన

భట్టిప్రోలు: హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ (హెచ్‌ఆర్‌పీసీ) నేషనల్ వైస్ చైర్మన్‌గా నియమితులైన భట్టిప్రోలు మండలం పెసర్లంకకు చెందిన యన్నం సురేష్‌ను శనివారం భట్టిప్రోలు బౌద్ధస్తూపం ఆవరణలో వివిధ సంఘాలు అభినందించి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అంబేడ్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు పీజీ అరుణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత రాజ్యం, హెచ్‌ఆర్‌పీసీ నిర్వాహకులు బుజ్జి, పెనుమాక రత్నబాబు, పి.నాగేశ్వరరావు, కె.మోహన్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు పి.గ్రేట్‌బేర్, పవన్ కుమార్, గోలి శ్రీనివాసరావు, మురాల కోటేశ్వరరావు, అంకబాబు, విజయరాజు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: క్రీడా స్ఫూర్తిని అందరూ కలిగి ఉండాలని ప్రముఖ వ్యాపారి ఈదర వెంకటపూర్ణచంద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలి బోసురోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న వ్యాయామశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 300మంది క్రీడాకారులు దీనిలో పాల్గొన్నట్లు చెప్పారు. అనంతరం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ నిర్వాహకులు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, కె.శ్రీనివాసరావు, సుమన్, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి నతానియేలు


నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సీఈ నతానియేలు

చెరుకుపల్లి: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర రూరల్ డెవలప్‌మెంట్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ప్రభుత్వ అధికారి ఎస్.నతానియేలు పేర్కొన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బలుసుల పాలెంలో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ రూ.1.5 లక్షల వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్డును, గ్రామ సర్పంచ్ కొనకళ్ళ నాగమల్లేశ్వరి సొంత ఖర్చుతో నిర్మించి పూర్తికావచ్చిన సీసీ రోడ్డును శనివారం నతానియేలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా ముంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొట్ట మొదటిగా బలుసుల పాలెం పంచాయితీలోనే పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల రవికిరణ్, డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి, బాపట్ల ఎస్ఈ, ముత్యంబాబు, ఎంపీడీఓ షేక్ మహబుబ్ సుభాని, పీఆర్ఏఈ సేవానాయక్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ


పెసర్లంకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి, పక్కన తహసీల్దార్

పెసర్లంక(భట్టిప్రోలు): ఇటీవల కృష్ణానదికి సంభవించిన వరదల నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు ఎస్టీ, ఎస్సీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలు మండలం పెసర్లంకలో వరద బాధిత కుటుంబాలకు రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు పలు సేవా సంస్థలు, సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో ఈ వరదలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయన్నారు. పంటలు పోయి ప్రస్తుతం ఖాళీగా ఉన్నందున ఉపాధి పనులు కల్పించాలని స్థానికులు ఆమెను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు బసవకోటేశ్వరరావు, ఎస్టీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దేవరకొండ రాము, సజ్జా పద్మావతి, చందోలు నాగలక్ష్మి కుమారి, వంగర శ్రీనివాస్, ఊసవరపు వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ చంద్రబాబు, ఎస్.సోనాలి, బి.హేమకిరణ్, పంచాయతీ కార్యదర్శి గణేష్, వీఆర్వో మంద్రు జక్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుకాణం తొలగించాలని ఫిర్యాదు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం పక్కనే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన దుకాణాన్ని తొలగించాలని దళిత రాజ్యం అధ్యక్షుడు జాలాది ఇస్సాకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇస్సాకు మాట్లాడుతూ ఇక్కడ దాతల సహకారంతో సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో దళిత రాజ్య సంఘం సభ్యుడిగా ఉన్న పేర్లి మోజస్ అక్రమ నిర్మాణాన్ని ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు దుకాణాన్ని ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతడిని సంఘం నుంచి తొలగించడం జరిగిందని తెలిపారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన



తెనాలిఅర్బన్: మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు మున్సిపల్ మార్కెట్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న మెప్మా అర్బన్ మార్కెట్ శనివారంతో ముగిసింది. మార్కెట్‌లో స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన ప్రమీదలు, ఫ్యాన్సీ వస్తువులు, పిండి వంటలు, పచ్చళ్లు, జ్యూట్ బ్యాగ్‌లు, గాజులు, గోళ్ళ రంగులు, హెయిర్ రిబ్బన్స్, చీరలు, మొదలగు వంటి వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఉత్పత్తులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని మెప్మా సీఎంఎం విజయ, పలువురు ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం

తెనాలిరూరల్: కాల్వలో జారిపడి గల్లంతైన రైతు మృతదేహం లభించింది. తెనాలి మండలం కొలకలూరుకు చెందిన గమిడి ఏడుకొండలు (55) శుక్రవారం కొమ్మమూరు కాల్వలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. మృతదేహం శనివారం సంగంజాగర్లమూడి సమీపంలో లభించింది. రూరల్ పోలీసులు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు.

పందులను రోడ్లపై వదలొద్దు

తెనాలిఅర్బన్: పందులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి హెచ్చరించారు. 29,30,31,32 వార్డులలోని పందుల పెంపకందారుల వద్దకు శనివారం వెళ్ళి వారి తో మాట్లాడారు. వార్డుల్లో తిరుగుతున్న పందులను తక్షణమే శివారు ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పందులపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని, అవిరాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెంపకందారులపై ఉందన్నారు. అనంతరం ఆయా వార్డులోని పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.